

బీడీ కార్మికులకు ఆర్థిక కష్టాలు

● రోజురోజుకూ పని దినాల కుదింపు
● మార్కెట్‌లో బీడీలకు తగ్గిన డిమాండ్
● చాలీ చాలని సంపాదనతో జీవనం

జగిత్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎదుగుబొదుగు లేని జీవితాలు.. చాలీచాలని సంపాదన... క్షీణిస్తున్న ఆరోగ్యాలు...ఇవీ బీడీ కార్మికులు జీవన పరిస్థితిగా మారింది. మార్కెట్‌లో బీడీలకు డిమాండ్ తగ్గడంతో యాజమాన్యాలు కార్మికుల పని దినాల్లో కోత విధిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడంతో కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా మారుతోంది. జిల్లాలో ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాలతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలే బీడీలు చుడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి నెల 26 రోజులు పని కల్పించా ల్సి ఉండగా ప్రస్తుతం గిరాకి లేకపోడంతో నెలలో 10 నుంచి 15 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారు.

బీడీ కార్మికుల సంఖ్య..

రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో సుమారు 7.50 లక్షల మంది పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో రాష్ట్రంలో సుమారు 4.07 లక్షల మంది జీవన భృతి పొందుతున్నట్లు అంచనాలున్నాయి. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది పీఎఫ్ కార్మికులు, సుమారు 60 వేల మంది నాన్ పీఎఫ్ కార్మికులుండగా ఇందులో ఎక్కువగా జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కార్మికులు పని చేస్తున్నట్లు అంచనా. బీడీ కార్మికులకు చేయూత నిచ్చేందుకు ఆసరా కింద ప్రత్యేక జీవన భృతిని ప్రభుత్వం ప్రతీ నెల అందిస్తోంది. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వం 88,839 మంది బీడీ కార్మికులకు జీవన భృతి అందిస్తోంది.

గుది బండలా నిర్ణయాలు...

కేంద్ర ప్రభుత్వం బీడీ కట్టలపై పుర్రె గుర్తును ముద్రించేలా ఆంక్షలు విధించడం, బీడీలపై 28 శాతం జీఎస్టీ అమలు చేయడం, పీఎఫ్ పరిధిలో ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 4 వేల పెన్షన్ ఇవ్వాలనే నిబంధన అమలు కాకపోవడం, అనారోగ్యం బారిన పడి బీడీలు చుట్టలేని కార్మికులకు ఈఎస్ఐ వర్తింప జేయకపోవడం, మెరుగైన వైద్యం కోసం అధునాతన ఆసుపత్రులు లేకపోవడం వంటి కారణాల వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పదేళ్ల పనిచేసి రాజీనామా చేసినట్లయితే పెన్షన్ అందేది.. ప్రస్తుతం 3,365 పనిదినాలు పూర్తి చేస్తేనే పెన్షన్ అందేలా నిబంధనలు సవరించారు.

సంక్షేమం హాంఫట్...

గతంలో బీడీ కార్మికుల కళ్లద్దాలకు రూ. 300, రెండు కాన్పులకు ప్రసూతి సాయం రూ. వెయ్యి, టీబీ పరీక్షలు మందులు, గుండె జబ్బులు రూ. 1.30 లక్షలు, మూత్ర పిండాల మార్పిడికి రూ. 2 లక్షలు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రూ. 10 వేలు, అపెండెక్స్, అల్సర్ ఆసుపత్రులకు రూ. 30 వేలు, కార్మికుల పిల్లల్లో వితంతువులు ఉంటే రూ. 5 వేలు ఆర్థిక సాయం అందేది. దహన సంస్కారాలకు రూ. 1,500, సొంత స్థలం ఉండి ఇళ్ల నిర్మాణం చేసుకుంటే రూ. 1.50 లక్షల సబ్సిడీ సాయం ఉండేది. కానీ ఇప్పుడు ఆ పథకాలు అమలులో లేకుండా పోయాయి. దీంతో బీడీ కార్మికుల సంక్షేమం అంతంతమాత్రంగా అందుతోంది.

నాన్ పీఎఫ్ కార్మికుల ఎదురుచూపులు..

పీఎఫ్‌తో సంబంధం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి జీవనభృతి అందించాలన్న డిమాండ్ ఉంది. ప్రభుత్వం జీవన భృతి మంజూరులో జాప్యం చేస్తుండడాన్ని నిరసిస్తూ బీడీ కార్మికులు, బీడీ కార్మిక సంఘాలు పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించాయి. పీఎఫ్ కటాఫ్ తేదిని ఎత్తి వేసి అర్హులైన కార్మికులందరికీ జీవన భృతి అందించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ నాన్ పీఎఫ్ కార్మికులకు జీవన భృతి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

సమస్యలు పరిష్కరిస్తేనే మేలు...

ప్రస్తుతం కార్మికులకు రూ. వెయ్యి పెన్షన్ అందుతోంది. దానిని రూ. 5 వేలకు పెంచాలని డిమాండ్ ఉంది. వెయ్యి బీడీలకు రూ. 245.80 కూలీ చెల్లిస్తున్నారు. ఇటీవల అదనంగా రూ. 4.25లకు పెంచారు. దానిని రూ. 500లకు పెంచాలని, ప్రతీ నెల 26 రోజులకు తగ్గకుండా పనిదినాలు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. బీడీ కార్మికులకు ఉపాధి కొరవడిన తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పరిశ్రమలోని అర్హులైన వారందరికీ ఆసరా పించన్లను మంజూరు చేయాలని, బీడీల తయారీకి తగినట్లుగా తునికాకు సరఫరా, గతంలో మాదిరిగా ప్రభుత్వ సంక్షేమ నిధిని పున రుద్ధరించి కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల మం జూరు, వైద్య సేవలు అందించడం, అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తేనే బీడీ పరిశ్రమ మనుగడలో ఉంటుందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



నిబంధనల మేరకు పని దినాలు కల్పించాలి
సుతారి రాములు, ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి

బీడీ కార్మికులకు నిబంధనల మేరకు పని దినాలు కల్పించాలి. ప్రతీ నెల 26 రోజులకు తగ్గకుండా పని దినాలు కల్పించాల్సి ఉండగా, పలు కంపెనీల యాజమాన్యాలు పది నుంచి పదిహేను రోజుల మాత్రమే పని దినాలు కల్పిస్తున్నారు. దీంతో చాలీ చాలని ఆదాయంతో కార్మికులు ఆర్థిక కష్టాలకు గురవుతున్నారు.

20కి పైగా రంగాల వారికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి...

పరిశ్రమపై ఆధారపడి పొగాకు ఉత్పత్తి దారులు, తునికాకు సేకరించే వారు, బీడీ చుట్టే వారు, ప్యాకర్లు, చాకర్లు, టేకేదార్లు, కంపెనీల్లోని సిబ్బంది, గంపలు, చాటల తయారీ దార్లు, రవాణా దారులు తదితరాలన్నీ కలు పుకొని దాదాపుగా 20కి పైగా రంగాల వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో తయారైన బీడీలు ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్తుండడం ఇక్కడి అధిక సంఖ్యలోని కార్మికులు, బీడీ పరిశ్రమ ప్రాధాన్య తను వెల్లడిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఆశించిన పనులు లేక కురాల్లుతోంది. చాలా మంది కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి జీవనం సాగించేందుకు బీడీ లు చుట్టే పనిని ఎన్నుకుని పిల్లల చదువులు, ఇతరత్రా ఇంటి ఖర్చులను సంపాదిస్తారు. ఉమ్మడి జిల్లాలో బీడీ పరిశ్రమపై ఆధారపడిన టేకేదార్లు, ఇతరుల సంఖ్య సుమారు 48 వేలు ఉన్నట్లుగా అంచనా ఉంది.



నరసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు





ధర్మపురిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి స్వామి చిత్రపటం ఇస్తున్న ఈవో..కొండగట్టులో ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 14: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి ఆయనను ఘనంగా ఆశీ ర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి ఘనంగా సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ జడ్జి పూజలు

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ వేంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు ఆ దివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి ఘనంగా సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువతో సత్కరించారు.

ఎస్‌సీఈఆర్‌టీ ఎంట్రెన్స్ పరీక్షలో జగిత్యాల విద్యార్థి ప్రతిభ

జగిత్యాల అర్బన్, జూలై 14: పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన బడే మనోజ్ అనే విద్యార్థి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) వారు నిర్వహించిన కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో ఆర్‌ఐఈ ఓపెన్ కేటగిరిలో రాష్ట్ర స్థాయి సెకండ్ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. పట్టణంలోని జ్యోతి హై స్కూల్‌లో పదవ తరగతి పూర్తిచేసి, బాసర ఐఐటీలో ఎంపీసీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన మనోజ్ ఎన్‌సీఈఆర్‌టీ పోటీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. పోటీ పరీక్షకు హాజరై రాష్ట్రంలోని ఏడు సీట్లలో ఓపెన్ కేటగిరిలో స్టేట్ రెండవ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.

యువకుడి హఠాన్మరణం

మల్యాల, జూలై 14: మొహరం వేడుకల్లో భాగంగా పులి వేషధారణలో ఉన్న ఓ యువకుడు హఠాన్మరణం చెందాడు. మల్యాల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బెక్కం లక్ష్మణ్(24)అనే యువకుడు ఆదివారం తోటి మిత్రులతో కలిసి పులివేషధారణ వేశాడు. మధ్యాహ్నం వరకు పులి వేషంతో ఆకట్టుకోగా చాతిలో నొప్పితో రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి వచ్చి పడిపోవడంతో యువకుడి కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108లో జగిత్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. లక్ష్మణ్‌కు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మున్నూరుకాపు జిల్లా కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలరూరల్, జూలై 14 : జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోగల బండారిగార్డెన్‌లో ఆదివారం జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెదలు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా అమిరిశెట్టి లక్ష్మీనారాయణ, ఆర్థికకార్యదర్శిగా కుంట సుధాకర్, ఉపాధ్యక్షులుగా బండారి శంకరయ్య, పుప్పాల రాజేష్, చిన్నం తిరుపతి, మహిళా ఉపాధ్యక్షురాలుగా వంగల కవిత, సంయుక్తకార్యదర్శులుగా దేశెట్టి రాజారెడ్డి, దొనకంటి గంగాధర్, జక్కుల లింగారెడ్డి, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శిగా నవ్వ లక్ష్మీలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బైరం హరికిరణ్, ఉప ఎన్నికల అధికారులు సాయిని పాపన్న, కొలగాని శ్రీనివాస్ తెలిపారు.

ఎమ్మెల్యేకు వీఆర్‌ఏల వినతి



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

జగిత్యాల, జూలై 14: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు జగిత్యాల నియోజకవర్గ వీఆర్‌ఏలు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా విధులు నిర్వర్తిస్తున్న 61 ఏళ్ల పైబడిన 3797 మంది వీఆర్‌ఏలకు పదవీ విరమణ వయస్సు నిర్ధారణ కాలేదని, వారి స్థానంలో దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్న వారి వారసులకు విద్యార్హతనుబట్టి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వీఆర్‌ఏల సమస్యలను ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ

రాయికల్, జూలై 14: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్ ఇటీవల గల్ఫ్‌లో మరణించగా ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కథలాపూర్, జూలై 14 : మండలంలోని భూషణరావుపేటలో ఆదివారం పోచమ్మ బోనాల పండగ ఘనంగా జరిగింది. అమ్మవారి సన్నిధికి మహిళలు పూజల కోసం ఉదయం నుంచి బారులు తీరారు. సాయంత్రం గ్రామ పెద్దల సమక్షంలో డప్పు చప్పుళ్లతో గంగపుత్రులు వలలతో అమ్మవారి సన్నిధికి ఊరేగింపుగా వెళ్లారు పురవీధుల వెంట అంబటి నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్ద పోచమ్మలకు యాటలను బలిచ్చారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నారు.

రాయికల్ ప్రజలపై ఎందుకు వివక్ష

●డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం 13 ఏళ్లుగా నిరీక్షణ
●మున్సిపల్ భవన నిర్మాణంలో జాప్యం
●బీఆర్‌ఎస్ నాయకుల సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాయికల్, జూలై 14: రాయికల్ ప్రజలపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఎందుకు కక్ష్యగట్టి, వివక్ష చూపుతున్నారని మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రాయికల్ పట్టణానికి ఎలాంటి నిధులు కేటాయించ లేదని, ప్రస్తుతం మున్సిపల్ సిబ్బందికి నెలసరి జీతాలు చెల్లించే పరిస్థితి లేకపో వడం ప్రభుత్వ సమర్థతకు తార్కాణంగా నిలిచిందని అన్నారు. సిలిండర్ సబ్సిడీ, విద్యుత్ బిల్లు మాఫీ ప్రజలకు అందడం లేదన్నారు. రాయికల్ పట్టణ, మండల అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం తగదని అన్నారు. ఎప్పుడూ జగిత్యాల నూకపల్లి డబుల్ బెడ్ రూంల అభివృద్ధి కోసమనే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాయికల్ డబుల్ బెడ్ రూంలను పట్టించుకోకపోవడంతో 13 ఏళ్లుగా ఎంపికైన 60 మంది లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారని తెలుసుకోలేకపోతున్నారని అన్నారు. జగిత్యాల అభివృద్ధి గురించి మాట్లాడే ఇద్దరు కాంగ్రెస్ పెద్దలు వచ్చే నియోజకవర్గ పునర్విభజనలో జగిత్యాల నియోజకవర్గంలో రాయికల్ మండలం ఉండదని ముందస్తు గానే గ్రహించి రాయికల్ అభివృద్ధి నిధులు మంజూరు చేయడం లేదా అని ప్రశ్నించారు. గతంలో మూడు నెలల్లో నిర్మాణం చేస్తానని చెప్పిన మున్సిపల్ భవన నిర్మాణం ఆగిపోయి నత్తనడకన సాగుతుందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించాలన్నారు. తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేసి అర్హులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, మారంపెల్లి సాయి, నాయకులు ఎలిగేటి అనిల్ కుమార్, శ్రీరాముల సత్యనారాయణ, పెండెల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జూలై 14: సీఎం సహాయనిధి నిరుపేద ప్రజలకు వరంలాంటి దని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్‌లో ఆదివారం పట్టణానికి చెందిన 110 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.25 లోల 82 వేల 200లు విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

●జగిత్యాల పావని కంటి ఆస్పత్రి, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని 15 మందికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, ఆపి, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, కొత్త ప్రతాప్, కాశీ రావు, సాగర్ రావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం

జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ కృష్ణ



పథకాలతో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు

జగిత్యాల అర్బన్, జూలై 14: ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరమని, బాలబాలికలకు ఆత్మరక్షణ విద్య అత్యంత అవశ్యకమని జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మెన్ మంచాల కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో జిల్లా స్థాయి తైక్వాండో అసోసియేషన్ జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచాల కృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ద్వారా విద్యద్వారా శారీరక మానసిక ధృడత్వం వృద్ధి చెందుతుందన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా నుంచి సుమారు 160మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానం పొందిన విద్యార్థినిలను ఈ నెల 19 నుంచి 21 వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆయా జిల్లాల బాధ్యులు గందె సంతోష్, కోల గంగారాం, సతీష్, సంతోష్‌తో పాటు కోచ్‌లు రాజేంధర్, కిరణ్‌కుమార్, నాగమణి, అంజలి, రమ్య, గణేష్, రెఫరీలు షోయబ్, మహేష్, హైమవతితో పాటు మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులున్నారు.

కంటి శస్త్ర చికిత్సకు తరలింపు



శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జగిత్యాల, జూలై 14: జగిత్యాల పట్టణంలోని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మోతె బిందు శస్త్ర చికిత్స నిమిత్తం రేకుర్తి కంటి ఆస్పత్రికి రోగులను తరలించారు. మూడవ విడత ద్వారా నేటికి 120 మందికి విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించామని తెలిపారు. అధ్యక్షుడు లయన్ తాటిపాముల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లయన్ వడ్లగట్ల శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, చార్టర్ ప్రెసిడెంట్ శ్రీరాముల సుదర్శన్, కుందారపు జలంధర్, వడ్లగట్ల గోపి, దోపటి దేవాస్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 3,183 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగు తోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతా ల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.788 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 18.716 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.050 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని అధికారులు దెలిపారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత పోలీసులదే



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 14: వృద్ధుల సంరక్షణ బాధ్యత పోలీసులదేనని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ రక్షణ దినోత్సవం ఆదివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌ల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు తక్షణమేచర్యలు తీసుకుంటారన్నారు. వయోవృద్ధులైన పోషకుల పోషణ చూడకుంటే ట్రిబ్యునల్ అధికారి అయిన ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెక్షన్ 24 ప్రకారం ఆర్డీవోలకు పోషకులను నిర్లక్ష్యం చేసిన వారిని 6నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అధికారం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు, ప్రతినిధులు నారాయణ, సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది సతీష్‌రాజ్, సింగం గంగాధర్, పబ్బా శివానందం పాల్గొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ముందా?

- కాంగ్రెస్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ - హరీశ్‌రావు బీజేపీలో చేరినా రాజీనామా చేయాల్సిందే..

కరీంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరే దమ్ముందా అని కాంగ్రెస్ నాయకులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొందరు ఎమ్మెల్యేలు అక్రమాస్తులు కాపాడుకోవడానికే అధికార పార్టీలో చేరుతున్నారని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల అభివృద్ధికోసం కాంగ్రెస్‌లో చేరుతున్నామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎనిమిది స్థానాల్లో గెలిపించారన్నారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాట్లాడుతున్న అధికార పార్టీ నేతలు మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పు కోరాలన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది ఒక రాజకీయ డ్రామా అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేయబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారమంతా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న కుట్రలో భాగమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను, దొంగ హామీలను ప్రజలు గుర్తించారన్నారు. నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనే ఇందుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుకోవడానికి కేసీఆర్, దొంగ హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారన్నారు. హరీశ్‌రావు మంచి పొలిటీషియన్ అయినా ఆయన బీజేపీలో చేరితే రాజీనామా చేయాల్సిందేనని బండి సంజయ్ అన్నారు. ఎవరు రాజీనామాలు చేసి బీజేపీలో చేరినా గెలిపించుకునే సత్తా మా కార్యకర్తలకు ఉందన్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక ఆపార్టీ లీడర్లను ఢిల్లీకి పంపి లీకులిస్తున్నారని విమర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీనే చిన్న పార్టీ అని గతంలో హేళన చేశారని, ఇప్పుడు బీఆర్ఎస్‌ను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. మాకున్న ఏకైక లక్ష్యం తెలంగాణను అభివృద్ధి చేయడమేనని బండి సంజయ్ స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో నాతో పాటు మా పార్టీ కార్యకర్తలను ఏ విధంగా హింసించారో, అక్రమ కేసులు పెట్టి జైలులో వేశారో ఎవరూ మర్చిపోలేరన్నారు. అధికార పార్టీ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా జనం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ వన్‌టైం సెటిల్‌మెంట్ ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కళాశాల యాజమాన్యాలు అనేక ఇబ్బందుల్లో ఉన్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే విద్యార్థులు అనేక కష్టాలు పడతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీలో గంజాయి పట్టివేత


గంజాయితో యువకుడు

సుల్తానాబాద్, జూలై 14: సుల్తానాబాద్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు గంజాయితో పట్టుబడ్డ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం స్థానిక పూసాల రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పూసాల నుంచి సుల్తానాబాద్ వైపు స్కూటీ వస్తున్న ఓ యువకుడిని పోలీసులు ఆపి తనిఖీ చేయగా అతని స్కూటీలో గంజాయి లభించింది. అతన్ని విచారించగా చంద్రాపూర్ నుంచి గంజాయి తీసుకొచ్చి సుల్తానాబాద్ లో విక్రయిస్తున్నట్లు తెలిపాడని ఎస్ఐ చెప్పారు. అతని వద్ద రైల్వే, బస్సు టిక్కెట్లు, సెల్ ఫోన్ తో సహా 271 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

రాయికల్, జూలై 14: మండలంలోని సింగర్రావుపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాయికల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాటస్థావరంపై దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3810 నగదు సీజ్ చేశారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఉద్రిక్తతకు దారి తీసిన యువకుడి ఆత్మహత్య ఘటన

- ప్రేమ వ్యవహారంలో కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువుల ఆందోళన


లింగన్నపేటలో బైఠాయించిన మృతుడి బంధువులు, పోలీసులు, మృతుడి బంధువుల మధ్య వాగ్వాదం, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనాథ్(ఫైల్)

గంభీరావుపేట, జూలై 14: రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ప్రేమ వ్యవహారంలో తుడుము శ్రీనాథ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. శ్రీనాథ్‌ను కొట్టడం వల్లే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. కొట్టిన వ్యక్తి ఇంటి ఎదుట శ్రీనాథ్ మృతదేహంతో బంధువులు, గ్రామస్థులు బైఠాయించారు. ఆత్మహత్యకు కారణమైన వారు ఇక్కడికి రావాలంటూ డిమాండ్ చేశారు. అంతకుముందు శ్రీనాథ్‌ను కొట్టిన వారి ఇంటి వద్దకు మృతదేహాన్ని తీసుకువచ్చే క్రమంలో పోలీసులకు, మృతుడి బంధువులకు వాగ్వాదం జరిగింది. గంటకు పైగా పోలీస్‌లతో వారి బంధువులకు వాగ్వాదం జరగడంతో గ్రామంలో ఒక్కసారి వాతావరణం వేడెక్కి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీనాథ్ మృతదేహాన్ని కొట్టిన వ్యక్తి ఇంటి వద్దకు తీసుకువచ్చి ధర్నా నిర్వహించారు. ఈ నెల 10న తుడుం శ్రీనాథ్ (24) అనే యువకుడు ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామ సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. శ్రీనాథ్‌ను మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించగా శనివారం సాయంత్రం చికిత్సపొందుతూ మృతి చెందాడు. ప్రేమ వ్యవహారమే శ్రీనాథ్ ఆత్మహత్యకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తూ ముందుగా శనివారం అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించినప్పటికీ ఆదివారం కూడా ఆందోళన కొనసాగించారు. ప్రేమించిన అమ్మాయి అన్నతో పాటు అతడి స్నేహితులు తమ కొడుకును కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని శ్రీనాథ్ తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కొడుకు ప్రేమించిన అమ్మాయితో పాటు కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీనాథ్‌ను కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ కొట్టిన వారి ఇంటి ఎదుట రోడ్డుపై మృతుడి బంధువులు మృతదేహంతో బైఠాయించారు. శ్రీనాథ్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, లేకపోతే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పట్టుబట్టారు. ఎస్ఐ రాంమోహన్ సముదాయించినా వినకపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల సీఐ మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట ఎస్ఐలు పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. శ్రీనాథ్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ, సీఐ చెప్పడంతో వారి శాంతించారు.

నరసింహుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి పూజలు

ధర్మపురి, జూలై 14: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కే.లక్ష్మన్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి. స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్, మధు, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి

ఎల్ఎండీలో తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- ఇద్దరిని రక్షించి, కౌన్సెలింగ్ ఇచ్చిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 14: కుటుంబ కలహాలతో విసిగిపోయి ఆత్మహత్యకు యత్నించిన తల్లీకొడుకులు మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా అక్కడే విధుల్లో ఉన్న లేక్ పోలీసులు రక్షించారు.

లేక్ అవుట్‌పోస్ట్ ఎస్ఐ అర్జం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన చౌదారపు భారతమ్మ(58), ఆమె కొడుకు చౌదారపు గిరీష్‌కుమార్(34) ఆదివారం మానేరు జలాశయంలోకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చిన లేక్ పోలీసులు వారిని వెంటనే అదుపులోకి తీసుకుని అవుట్‌పోస్ట్‌కు తరలించారు. అనంతరం కారణాలను అడగగా కుటుంబ కలహాల కారణంగా తాము చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తల్లీకొడుకులకు లేక్ అవుట్‌పోస్ట్ ఎస్ఐ సురేష్ కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇద్దరిని రక్షించిన లేక్ ఎస్ఐ, సిబ్బందిని అధికారులు అభినందించారు.

డెంటల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎస్ సతీష్ పి రాజు

సిరిసిల్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఎన్నికలకు ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది దంత వైద్యులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ సతీష్, కార్యదర్శిగా డాక్టర్ పి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామని సతీష్, రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ శివసంతోష్, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ స్నేహా, డాక్టర్ జవాలి రెడ్డి, డాక్టర్ అకాంక్ష డాక్టర్ సుస్మిత, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల దాడి: ముగ్గురికి గాయాలు

సారంగాపూర్, జూలై 14: మండలంలోని రేచపల్లి లచ్చనాయక్ తండాలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఆదివారం లచ్చనాయక్ తండా శివారు గ్రామం కొత్తపల్లెకు చెందిన సిరిపెల్లి చంద్రయ్య, బేతాల సంజీవ్, రేచపల్లికి చెందిన సిరికొండ మల్లయ్యలపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు అప్రమత్తమై బాధితులను వెంటనే సారంగాపూర్ పీహెచ్‌సీకి తరలించి యాంటిర్యాబిస్ ఇంజక్షన్‌లు వేయించారు. పిచ్చి కుక్కలతో పాటు సాధారణ కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయని వీటిని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాల పండుగ


రాయికల్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


కొడిమ్యాలలో..

రాయికల్, జూలై 14: రాయికల్ పట్టణంలో ఆషాఢ మాసంలో భాగంగా పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం, పోపా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ దేవాలయం నుంచి గాంధీ విగ్రహం, బస్టాండ్ మీదుగా పోచమ్మ గుడి వరకు సుమారు 200 మంది మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గమ్మ బోనాలు..

మల్లాపూర్: ఆషాఢ మాసం సందర్భంగా మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో బోనాల పండుగను నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. సల్లంగా చూడమ్మ దుర్గమ్మ అంటూ భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం బోనం సమర్పించారు. జరిగిన కార్యక్రమంలో దుర్గమ్మ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడుపుల నర్సయ్య, సుంకట నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎర్ర భూమయ్య, మరిపెల్లి మల్లయ్య, నూతిపెల్లి రాజం, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మల్లాపూర్‌లోని దుర్గమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు, దుర్గమ్మకు సమర్పించిన బోనాలు

ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ సౌత్ రీజియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, జూలై 14: బెంగళూరు సుచిత్ర ఫిలిం సొసైటీలో ఆదివారం జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా వార్షిక సమావేశంలో సౌత్ రీజియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా డాక్టర్ పొన్నం రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఫ్ఎఫ్ఎస్ఎస్ఆర్ కార్యదర్శి డీఎస్ఎస్ ప్రకాశ్ ప్రకటించారు. ఎన్నిక పత్రాన్ని రవిచంద్రకు అందించారు. మూడేళ్ళుగా సౌత్ రీజియన్ అసిస్టెంట్ కార్యదర్శిగా ఉన్న రవిచంద్ర కొన్నేళ్ళుగా ఫిల్మ్ సొసైటీ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ అనేక సినీ వ్యాసాలు రాస్తున్నారు. రవిచంద్ర ఎంపిక పట్ల కఫిసొ కార్యదర్శి కె లక్ష్మీగౌతమ్‌తో పాటు హెచ్ రమేశ్ బాబు, పీవీ రామ్మోహన్ నాయుడు, పీఎస్ రవీంద్ర, అయినంపూడి శ్రీలక్ష్మి, అన్నవరం దేవేందర్, మాడిశెట్టి గోపాల్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, నంది శ్రీనివాస్, గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య హర్షం వ్యక్తం చేశారు.

చీరలు కొని రూ.10 వేలు టోకరా

- ఫేక్ మెసేజ్‌తో మోసం - జగిత్యాలలో ఘటన

జగిత్యాల, జూలై 14: బట్టల షాపులో చీరలు కొని షాప్ ఓనర్ దగ్గర పదివేల రూపాయలను ఓ దుండగుడు కొట్టేశాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 12న జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఓ వ్యక్తి వచ్చాడు. షాపులో రూ.2200 విలువ చేసే మూడు చీరలు కొన్నాడు. తన దగ్గర లిక్విడ్ క్యాష్ లేదని ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. అంతేగాక తనకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉందని చెప్పగా ఆ షాపు యాజమానురాలు తన భర్త నెంబర్‌కు ఫోన్ పే చేయమని చెప్పింది. వెంటనే అతడు రూ.10 వేలు ఫోన్ పే ద్వారా ఆమె భర్తకు ట్రాన్సాక్షన్ అయినట్టు ఫేక్ మెసేజ్ ఆమెకు చూపించాడు. ఆమె దగ్గర రూ.10 వేలు తీసుకుని వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. తన ఫోన్ పేకు ఎటు వంటి అమౌంట్ జమ కాలేదని ఆమె భర్త చెప్పాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌తో సహా బావిలో పడి యువకుడి మృతి


కీర్తి శేఖర్ (ఫైల్)

వేములవాడ రూరల్, జూలై 14: మండలం లోని నూకలమర్రి గ్రామంలో ట్రాక్టర్‌తో సహా బావిలో పడి యువకుడు మృతి చెందాడు. స్థానికులు పోలీసులు కథనం ప్రకారం నూకల మర్రి గ్రామానికి చెందిన కీర్తి శేఖర్ (28) తన బంధువు భూమయ్య పొలం దున్నేందుకు ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ తీసుకుని వెళ్లా డు. ట్రాక్టర్‌తో పొలం దున్నే క్రమంలో సమీపం లో ఉన్న బావిలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌తో సహా పడిపోయాడు. తీవ్రగాయా లపాలై శేఖర్ మృతిచెందాడు. గుర్తించిన స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. బావి నుంచి మృతదేహాన్ని, ట్రాక్టర్‌ను స్థానికులు, పోలీసులు వెలికితీశారు. మృతుడికి తండ్రి చంద్రయ్య, భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్ తీగలు పడి రెండు ఆవుల మృతి


విద్యుత్ తీగలు పడి మృతి చెందిన ఆవులు

చందుర్తి, జూలై 14: విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు పంట చేనులో మేతమేస్తున్న ఆవులపై పడడంతో రెండు ఆవులు మృతి చెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తర్రే లక్ష్మణ్‌కు చెందిన రెండు ఆవులు పంట చేనులో మేత మేస్తుండగా విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు ఆవులపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఆవుల విలువ దాదాపు లక్ష 60వేల పైగా ఉంటయని తెలిపారు. బాధిత రైతును సెస్ అధికారులు ఆదుకోవాలని రైతులు కోరారు.

రామగుండం రైల్వే స్టేషన్‌లో వెండి ఆభరణాలు స్వాధీనం

- ఆపరేషన్ సటార్క్ విజయవంతం

- రైల్వే సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్‌లలో ఆపరేషన్ సటార్క్ ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఈ ఆపరేషన్ ద్వారా రామగుండం రైల్వేస్టేషన్‌లో 51.164కిలోల వెండి ఆభరణాలు ముగ్గురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ తెలిపారు. ఆదివారం ఈ ఆపరేషన్ ద్వారా ఆర్పీఎఫ్ బృందం రామగుండం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వెంటనే విచారించి తనిఖీలు చేశామన్నారు. వీరి వద్ద నుంచి బ్యాగులో ఉన్న 51.164 కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు తెలుసుకున్నామన్నారు. ఈ ఆభరణాలు ఎక్కడి నుంచి వచ్చాయో ఆ ముగ్గురు వ్యక్తుల నుంచి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇచ్చారన్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి ఆభరణాలను పెద్దపల్లి ఐటీ అధికారులకు అప్పగించామని, ఈ ఆభరణాలు విలువ రూ.47లక్షలు ఉంటుందన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్

మెట్‌పల్లి, జూలై 14: దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జై భీమ్ సోల్జర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదుల సమ్మేళనం కార్యక్రమానికి అద్దంకి దయాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగం రచించి, దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఒక ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిగా భావించొద్దని, బడుగు బలహీనవర్గాల కోసం పోరాటం చేసిన ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప వారన్నారు. దేశంలోని అన్ని పార్టీలకు అతీతంగా, బడుగుబలహీన పేదరికంలో ఉన్న అన్నివర్గాల కోసం పోరాడిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్‌ను ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే భావించరాదన్నారు. బీసీ, మైనార్టీలతో పాటు ఎస్సీ వర్గాల ప్రజల కోసం కృషి చేశారన్నారు. అంబేద్కర్ లాగే జ్యోతిరావు పూలే బడుగు బలహీనవర్గాల కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. వారి ఆశయ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బత్తుల నరేష్, రెంజర్ల రాజేష్, అద్దంకి నాగమణి, పేట అశోక్, మేకల తుకారాం, బత్తుల భరత్, శేఖర్, నీరటి శేఖర్, మహిళలు, పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..తస్మాత్ జాగ్రత్త..

- ఈగలు, దోమల విజృంభణ
- డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలే ప్రమాదం
- పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



రాయికల్ పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

రాయికల్, జూలై 14: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈగలు, దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ అంటూ వ్యాధులు శరవేగంగా విస్తరిస్తాయి. కలుషిత నీటి వల్ల డయేరియా, అతిసారం వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయి. దీనికితోడు దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర విష జ్వరాలు విజృంభిస్తాయి. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి లోపల, బయట, చుట్టుపక్కల దోమల వృద్ధిని నిరోధించే ప్రక్రియలతో దోమకాటు నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టే యాంటీ లార్వా ఆపరేషన్లు, దోమల మందు పిచికారి, ఫాగింగ్‌పై ఆధారపడకుండా ఎవరికీ వారు తీసుకునే జాగ్రత్తలతో వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని వైద్యులు సలహాలు, సూచనలు చేస్తున్నారు. సమాజ ఆరోగ్యం కోసం సమష్టిగా పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

● ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మెలగాలి..

వర్షాకాలంలో ఈగలు, దోమలు అత్యంత ప్రమాదకరం. ఈగలు వదిలే వ్యర్థాలు, దోమకాటు వల్ల ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. కలరా, కామెర్లు, టైఫాయిడ్, విరేచనాలు తదితర రోగాలబారిన పడతారు. ప్రధానంగా బహిరంగ మల విసర్జన, అపరిశుభ్రత తినుబండారాలు, తోడుకలు పారేసిన ప్రాంతాల్లో ఈగలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. సాధారణంగా మాంసం విక్రేత కేంద్రాలు, మురుగునీటి కాలువలు, కోళబరాలు, హోటళ్ల తదితర ప్రాంతాల్లో ఈగలతో పాటు దోమలు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం అవసరం.

● వ్యాధులు-వాటి లక్షణాలు

ఈగలు, దోమల వల్ల సోకే డెంగీ, టైఫాయిడ్ వల్ల జ్వరం, నీళ్ల విరేచనాలు, చీము, బంక విరేచనాలు ఎక్కువగా ఉంటాయి. నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్ అవుతుంది. నీళ్ల విరేచనాలు, వాంతుల తర్వాత శరీరంలోని నీటి శాతం తగ్గి కలరా వ్యాధి కూడా సోకుతుంది. దీంతో కాలేయానికి వాపు రావడం, రక్త కణాలు తగ్గడం, కళ్లు పసుపుపచ్చగా మారి కామెర్లు రావడం, కడుపు నొప్పి, దాహం, నోరు పొడిబారడం, చర్మం ముడతలు తదితర లక్షణాలు సోకినవారిలో వ్యాధులు కనిపిస్తాయి.

● దోమలు-ఈగలు నివారణ మార్గాలు

వేప నూనె, కొబ్బరి నూనెను సమానంగా కలిపి చర్మంపై రాసుకుంటే దాదాపు ఎనిమిది గంటలపాటు దోమలు, ఈగలు దరికి చేరవు. అదే విధంగా యాంటీ బాక్టీరియా, యాంటీ ఫంగస్, యాంటీ వైరల్, గుణాలు వేప నూనెలో ఉంటాయి. నీటి నిల్వలోను వేప నూనె కలపాలి. అందులో ఏర్పడిన లార్వా చనిపోతుంది. వేరే తదితర నూనెలను సైతం నిల్వ నీటిలో చల్లి దోమల వృద్ధిని నివారించవచ్చు. మొక్కల కుండీల్లో, నీటి గుంతలు, సంపులు, కుండలు, కాలువలు, నల్ల గుంతలు, పాత టైర్లలో దోమ గుడ్లు పెరుగుతాయి. నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పెరటిలో ఔషద గుణాలు కలిగిన తులసి, పుదీనా, గ్రాస్ లేమన్ వంటి మొక్కలను పెంచితే దోమలు వ్యాధి చెందకుండా ఉంటాయి.

● దోమ తెరలు వాడాలి..

ప్రతి ఇంటిలో దోమ తెరలను వాడాలి. వాటి వల్ల దోమలు కాటు వేయకుండా నియంత్రిస్తాయి. చీకటి పడ్డాక తలుపులు, కిటికీలు తెరువకుండా ఉంటే ఇంటిలోకి రావు. కిటికీలకు వెంటిలేటర్‌లకు దోమ తెరలు అమర్చుకోవాలి. పరిసర ప్రాంత నీటిని ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చూసుకోవాలి. తాగునీటి ట్యాంక్‌లను తరచుగా క్లోరినేషన్ చేస్తుండాలి. పైపులైన్ లీకేజీలను అరికట్టాలి. చెరువులు, కాలువలు, మడుల్లో గంబుజియ చేపలను వదలాలి.

● జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం..

ప్రజలు వర్షాకాలంలో సోకే వ్యాధులను జాగ్రత్తలతోనే అరికట్టవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధులు పొంచి ఉండే కాలం కావడంతో కాచిన నీరు తీసుకోవాలి. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేడి ఆహారం, పానీయా లనే ఆహారంగా తీసుకోవాలి. దోమలు, ఈగలు, ఇతర క్రిములు వాల కుండా తిను బండారాలపై మూతలు ఉంచాలి. ఇంటిని ఫినాయిల్‌తో శు భ్రం చేసుకోవాలి. తినుబండారాలను రోడ్ల వెంట తినడం మానివేయా లి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పై జాగ్రత్తలు తీసుకుంటే మంచిద ని వైద్యులు సూచిస్తున్నారు.

● పరిశుభ్రతపై దృష్టి సారిస్తున్నాం..

చిరంజీవి, ఎంపీడీవో, రాయికల్



గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాం. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశాం. దోమలు, ఈగల మందు వారానికి ఒకసారి పిచికారి చేయాలని, మురికి కాలువల్లో తరచూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, మంచి నీటి బావుల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

పోచమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

- బల్దియా చైర్‌పర్సన్ జ్యోతి


బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

జగిత్యాల, జూలై 14(ఆంధ్రజ్యోతి): భక్తులకు కోరిన వరాలు ఇచ్చే తల్లి పోచమ్మ అని మహిమ గల పోచమ్మ తల్లి ఆశీస్సులు పట్టణ ప్రజలందరిపై ఉండాలని బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని స్థానిక వాణీనగర్ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో ఆషాడమాస పోచమ్మ బోనాలను పండగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని బోనమెత్తారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనం ఎత్తుకొని పురవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుర్రం రాము, సంఘం అధ్యక్షుడు కొక్కుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వాసం రఘుకు మార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నరేందర్, కోశాధికారి శ్రీహరి, గౌరవా ధ్యక్షులు చెన్న శ్రీనివాస్, రఘు భాస్కర్, రవి, రాజు, జయశ్రీ, సుధ, సూర్యకళ, సృజన్ తో పాటు మహిళామణులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్


గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

భీమారం, జూలై 14: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో వాతావరణ మార్పుల వలన సంభవించే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ కేసు నమోదైన కారణంగా ఇంటింటికీ తిరిగి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆసుపత్రిలో చూపించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామం లో జ్వరం వచ్చినవారిని మేడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్త పరీక్షల నిమిత్తం పంపించారు. కార్యక్రమంలో మేడిపల్లి మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ చంద్ర, సబ్ యూనిట్ ఆఫీసర్ అవారి శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ తిరుపతి రెడ్డి, సిబ్బంది సుశీల, సుమలత, రాధ, సంధ్య, లావణ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

కాణిపాకంలో మాజీ మంత్రి పూజలు

ధర్మపురి, జూలై 14: ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తిరుమల దేవాలయాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరసిద్ధి వినాయకుడిని, తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం పక్షాన వేదపండితుల ఆయనను ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. అలాగే ఆయన కంచి, అరుణాచలం, మదురై పుణ్యక్షేత్రాలను కూడా సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురిలో ఘనంగా గోరింటాకు వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న మహిళలు


గోరింటాకు వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

ధర్మపురి, జూలై 14: ధర్మపురి పట్టణంలోని హనుమాన్‌వీధిలో ధనలక్ష్మి కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసం పురస్కరించుకుని గోరింటాకు మహిళలు చేతులకు పెట్టుకున్నారు. మహిళలు అందరు సామూహికంగా ఉత్సాహంగా ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇనుగంటి నిర్మల, రమాదేవి, బలు మూరి సరళ, భీమనాతి మంగ, బెజ్జంకి శ్రీలత, కొండపెల్లి నాగరాణి, గాదె కవిత, నీరజ, రాధిక, శైలజ, అంకిత, ప్రతిభ, రజిత, రమ, శ్రీలత పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు


వన భోజనాల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం కుటుంబసభ్యులు

రాయికల్, జూలై 14: రాయికల్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడమాసం సందర్భంగా వన భోజనాలు, గోరింటాకు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు గోరింటాకు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి, ప్రధాన కార్యదర్శి గరిపెల్లి శ్రీనివాస్, కోశాధికారి పల్లెర్ల పవన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

గొల్లపల్లి, జూలై 14: మండలంలోని శంకర్రావు పేట గ్రామంలో జిల్లా కేంద్రానికి చెందిన పిల్లల అసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ అర్జున్ సుమారు 80 మంది పిల్లలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమున్న పిల్లలకు ఉచితంగా మందుల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెఇపారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాజామాజీ ప్రజా ప్రతినిధులు సరసాని రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, గోలి లక్ష్మీగంగారెడ్డి, గ్రామీణ వైద్యుడు అంతేల్పుల గణతిరుమల్, నాయకులు శేఖర్, లక్ష్మణ్, రంజిత్ రెడ్డి, రాజేశ్వర్, చుక్కయ్య, మల్లయ్య, లక్ష్మి, ఆసుపత్రి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక


పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, జూలై 14 : కరీంనగర్ పట్టణంలో నిర్వహించిన కరాటే పోటీలలో కోరుట్ల పట్టణానికి చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచి జాతీయ కరాటే పోటీలకు ఎంపికయినట్లు ఇన్‌స్ట్రక్టర్ అల్లే రమేష్ ఆధివారం తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌లో గల ఇందిరా గార్డన్‌లో ఈ నెల 13వ తేదీన జరిగిన కట్టా కుమ్మిత్ క్యాటగిరిలో ఒక ఏజ్ వెయిట్ క్యాటగిరిలో ఒకరి సామర్థ్యాన్ని రాష్ట్ర స్థాయిలో గుర్తించి జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు రమేష్ తెలిపారు. తెలంగాణ అసోసియేషన్ అఫ్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటే డో ఆధ్వర్యంలోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ 2024 అల్ ఇండియా స్టేట్ లెవల్ టోర్నమెంట్ తో పాటు ఇండియా (కాయ్) సెలక్షన్స్‌కు కోరుట్ల పట్టణానికి చెందిన ముగురు విద్యార్థులు రాణించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. కుమ్మిత్ జాతీయ స్థాయి పోటీలకు కటకం హేమంత్‌కుమార్, రాహులు, గాజెంగి కిశోర్‌లు ఎంపికయినట్లు రమేష్ తెలిపారు. వీరితో పాటు పోటీలలో రాణించి విద్యార్థులకు బంగారు వెండి పథకాలను సాదించినట్లు రమేష్ తెలిపాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను టోర్నమెంట్ డైరెక్టర్ జైదేవ్ శర్మ, అర్గనైజర్ శ్రీనివాస్, కార్యధర్శి నరేంధర్, తెలంగాణ చీఫ్ వసంత్ కుమార్, షిహన్ మోండయ్య, సాయికుమార్‌లు రాణించిన విద్యార్థులకు పతకాలను అందించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులతో పాటు కోచ్ రమేష్‌ను అభినందించి సన్మానించారు.

నేటి నుంచి అంగన్‌వాడీ బడిబాట

కథలాపూర్, జూలై 14 : ఈ నెల 15 నుంచి 20 దాకా అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాలు నిర్వహించనన్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. పంచాతీ కార్యదర్శులు, చిన్నారుల తల్లులు, మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. తొలి ఒడి అమ్మది..మలి ఒడి టీచర్‌ది, అంగన్‌వాడీలో చేర్పించండి...పిల్లలను ఆరోగ్యంగా ఉంచండి అనే నినాదాలు చేయాలని టీచర్లకు సూచించామన్నారు. నాణ్యత గల గుడ్లు, పాలు, పప్పు ఆదేశించారని పేర్కొన్నారు. బడిబాటతో చిన్నారుల తల్లిదండ్రులకు చైత న్యం కలిగిస్తామని తెలిపారు.

చిల్లర మాటలు మానుకోవాలి

మల్లాపూర్, జూలై, 14 : కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు ఆయన నర్సింగరావుపై ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడడం సమాంజసం కాదని, చిల్లర మాటలు మానుకోవాలని నాయకులు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ వాస్తవాలు తెలుసుకోని మాట్లాడా లని హితవు చేశారు. జువ్వాడి బ్రదర్స్ ప్రభుత్వం దృష్టికి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారని గుర్తు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పుంద్రా శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మరిపల్లి మల్లయ్య, నారాయణరెడ్డి, ఎర్ర భూమయ్య, నర్సయ్య, లక్‌పతిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, జూలై 14: మండలంలోని ఆలూరు గ్రామ ఉప సర్పంచ్ వెంకటేష్ తండ్రి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే చింతలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కదుర్ల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్


ఉప ముఖ్యమంత్రితో సమస్యను విన్నవిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి/భీమారం, జూలై 14: మేడిపల్లి మండలం కా చారం గ్రామంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను 132/33గా అప్‌గ్రేడ్ చేయాలని, భీమారం మండల కేంద్రంలో నూతనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్కను ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. లోవోల్టేజీ, ఓవర్ లోడ్ కారణంగా రైతులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సబ్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేయాలన్నారు.

దీనికి ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

మెట్‌పల్లి, జూలై, 14 : మెట్‌పల్లి పట్టణం శివారులోని రైలు కిందపడి లవంగ నరేందర్ (45)అను వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండల స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందనే సమాచారం తెలుసుకున్న సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన వివరాలను పరిశీలిస్తుండగా సమీపంలో ఆధార్‌కార్డు జెబులోని వస్తువులు పడి ఉన్నాయి. వాటిని పరిశీలించగా మెట్‌పల్లి పట్టణ అనుబంధ గ్రామమైన రేగుంట గ్రామానికి చెందిన లవంగ నరేందర్‌గా గుర్తించారు. రైల్వే అధికారులు మోర్తాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైల్వే అధికారులు, మోర్తాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

మెట్‌పల్లి, జూలై, 14 : ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో దుబాయిలో మృతి చెందిన వలసజీవి మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మంగలి దశరథం(55) ఇరవైనాలుగు ఏళ్లుగా గల్ఫ్ దేశానికి వెళుతున్నాడు. షార్జాలో ఓ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జూన్ 30న ఛాతిలో నొప్పిరావడంతో దుబాయ్‌లోని షార్జాలోని ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఈనెల 14న మృతదేహం స్వగ్రామానికి చేరింది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు

కేంద్ర ప్రభుత్వ ఆర్డర్లు అందించాలి


కరీంనగర్‌లో కేంద్రమంత్రిని కలిసిన సిరిసిల్ల వ్యాపారులు

సిరిసిల్ల రూరల్, జూలై 14 : సంక్షోభంలో కూరుకుపోయిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను గట్టెంక్కించాలని, వాటిపైన ఆధారపడిన కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని వస్త్ర పరిశ్రమల యజమానులు కోరారు. సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం, పవర్‌లూం ఉత్పత్తిదారుల సంఘం, సిరిసిల్ల ఆసాముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఆదివారం కరీంనగర్ లోని కేంద్ర మంత్రి బండిసంజయ్‌కుమార్ నివాసంలో కలిశారు. బీజేపీ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమస్యలను విన్నవించారు. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించి కార్మికులతో పాటు తకు ఉపాధిని కల్పించాలని వినతి పత్రం అందజేశారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూ లంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారని నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే సిరిసిల్లలో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, అంకాలపు రవీందర్, దూస రమేష్, మండల బాలరాజు, బండారి అశోక్, బూట్ల సతీష్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, గౌడరాజు, శ్రీగాధ విష్ణు, సాప గణేష్, పవర్‌లూం ఉత్పత్తిదారుల సంఘం నుంచి కట్టెకోల లక్ష్మీనారాయణ, కోడం అశోక్, ఆసాముల సంఘం నుంచి సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్, మండల రాజు, బూర శ్రీనివాస్, ఆడెపు సాగర్, దూస రమేష్, దూస అశోక్, చిలుక రాజు పాల్గొన్నారు.

రేచపల్లిలో ఉచిత వైద్య శిబిరం

సారంగాపూర్, జూలై, 14 : మండలంలోని రేచపల్లి గ్రామంలో సాయి స్వాస్థ్య వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జైపాల్‌రెడ్డి, వేణు కడర్ల, సంతోష్, మానస, కేశవ్, జ్యోతి, ఈ శిబిరంతో పాల్గొని 200 మందికి పరీక్షలు నిర్వహించి మందలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ జడ్పీటీసీ భూక్య సరళ, మాజీ సర్పంచ్ జయ, నాయకులు తిరుపతిరెడ్డి, బేర మహేస్, బేర కొమురయ్యశ్రీకాంత్, మల్లీఖార్జున్, వేణు, శ్రీహరి, సంజీవ్, సురేష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె చౌరస్తాలోని శ్రీ పావని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350 మందికి మధుమేహం, బీపీతో బాధ పడుతున్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గంగుల పద్మమల్లేష్ యాదవ్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ చెట్‌పెల్లి హరేందర్, సోమయ్య, సత్యం పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు

ధర్మపురి, జూలై 14: ధర్మపురి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఆలయానికి వెళ్లారు. అనంతరం పోచమ్మ దేవతకు పసుపు, కుంకుమ చల్లి, కనుములు సమర్పించారు. చల్లగా దీవించమ్మా తల్లి అంటూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూరగాయల సంతోష్‌కుమార్, మురికి శ్రీనివాస్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షులు అక్కెనపెల్లి రాజేందర్, జిల్లా నాయకులు జక్కు రవీందర్, కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, కొండ రవి, చెట్ల మహేష్, కోటగిరి శ్రవణ్, చౌదారపు సతీష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జక్కు పద్మ, రాధిక, పద్మ, భవాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, జూలై 14: మండలంలోని మల్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో హై ఎక్స్‌టెన్షన్ మరమ్మత్తు పనులు జరుగనున్నందున మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ముదిరాజ్ కార్యవర్గం ఎంపిక

కోరుట్ల, జూలై 14 : కోరుట్ల పట్టణం ప్రకాశం రోడ్డు ముదిరాజు సంఘ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని పెద్దమ్మ దేవాలయ అధ్యక్షుడుగా అలువాల శంకర్, ఉపాధ్యక్షుడుగా పోగుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా పోగుల లింగమూర్తి, కోశాదికారిగా కలాల అనిల్ ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. నూతనంగా ఎంపికయిన కమిటీ సంఘ సభ్యులు సన్మానించి అభినందించారు.

మొహర్రం కోలాహలం

మల్యాల, జూలై 14: మల్యాలలో మొహర్రం వేడుకల కోలాహలం నెలకొంది. నిత్యం వందలాది పులివేషధారణలతో సందడిగా మారుతోంది. పులివేషాల విన్యాసాలను చూడటానికి నిత్యం జనాలు వందలాదిగా తరలివస్తుండడంతో మండల కేంద్రంలో రద్దీ ఏర్పడుతోంది. ఆదివారం పెద్ద ఎత్తున జనాలు పులివేషాలను వీక్షించారు.

సాయిబాబా పారాయణం ప్రారంభం

జగిత్యాల, జూలై 14: జగిత్యాల జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకుడు వేణు, ప్రముఖ పౌరాణిక వేద పండితులు బ్రహ్మశ్రీ తిగుళ్ల విషు శర్మ ఆధ్వర్యంలో 108 కలశాలు స్థాపించి, 108 భక్తులు నిష్ఠతో పారాయణం ప్రారంభించారు. ఈ పారాయణం ఈ నెల 21 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ సతీష్ కుమార్, మార కైలాసం, కిషన్, కిషన్, గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాలరూరల్, జూలై 14 : జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన జె. రాజయ్య ఇటీవలే కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన పడిగెల ఆగమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా మృతురాలి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. నాయకులు నక్కల రవీందర్ రెడ్డి, గుంటి రవి, గంగారెడ్డి, చిరంజీవి, గంగారాజం, మల్లారెడ్డి, దుబ్బయ్య బోయ గంగాధర్ పాల్గొన్నారు.